క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ గెలుపు కోరుతూ జోరుగా ప్రచారం



కృత్తివెన్ను: ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు మరింత చేరువగా రావాలంటే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావాలని జోరుగా ప్రచారం చేస్తున్నారు పార్టీ నేతలు. మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను పంచుతూ ఫ్యాన్‌ గుర్తుకు ఓటేసి పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని, అప్పుడే జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి గడపను సందర్శిస్తున్న వారికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నగరంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



మచిలీపట్నంటౌన్‌: నగరంలోని పలు డివిజన్లలో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావులకు ఫ్యాన్‌ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేసి నమూనా ఈవీఎం ప్యాడ్‌పై ఓటు ఎలా వేయాలో ఓటర్లకు వివరించారు.

తండ్రి గెలుపు కోరుతూ కుమార్తె ప్రచారం




లక్ష్మీపురం(చల్లపల్లి): వైఎస్సార్‌ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌ బాబు గెలుపు కోసం ఆయన కుమార్తెలు ఎన్నికల ప్రచారం చేశారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే కుమార్తె సింహాద్రి నిశ్చల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు సీలింగ్‌ ఫ్యాన్‌ గుర్తుపై వేసి ఎంపీగా డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావును, ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌ బాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని నందమూరు ఎంపీపీ బొల్లా ఉదయ్‌నాగకుమార్‌ ప్రారంభించారు. వేసవి కాలం దృష్ట్యా వాహనదారులకు, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్‌ కె.కుమార్‌బాబు, ఈడీలు డి.బాబా, కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బీఆర్‌ఎస్‌రెడ్డి ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ అనిల్‌కుమార్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు పాల్గొన్నారు.

అకాలవర్షం.. ఈదురు గాలులు



మచిలీపట్నంటౌన్‌: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో మంగళవారం అకాలవర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎండ కాచి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురుగాలులు వీచాయి. కొద్ది సేపటికి భారీ వర్షం కురిసింది. మండు వేసవిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో నగరవాసులకు సేదతీరారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో వర్షపునీరు చేరింది. కొద్ది సేపటికి డ్రైయిన్ల ద్వారా పారి ముంపు సమస్య తీరింది. బలమైన ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్‌ వైర్లు తెగి విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా సాయంత్రం ఐదు గంటల నుంచి విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్‌

గూడూరు: సంక్షేమ పథకాలు రానున్న కాలంలో కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్‌ (రాము)అన్నారు. విజయీభవ యాత్రలో భాగంగా మంగళవారం గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు. మల్లవోలు నుంచి ప్రారంభమైన రోడ్డు షో ముదిరాజుపాలెం, ఆకుమర్రు, రామరాజుపాలెం, గూడూరు, తుమ్మలపాలెం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుకానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో జగనన్న ప్రవేశ పెట్టి అమలు చేశారని ఆయన కొనియాడారు. ఒకవైపు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడం వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందని రాము అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమేకాకుండా ప్రభుత్వంలో మేలు జరిగితేనే తనకు ఓట్లు వేయమని దమ్ముగా చెప్పిన ఏకైక నాయకుడు మన జగనన్న ఒక్కడే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్‌.మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు జి.సురేష్‌రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్‌ ఎం.రత్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు పి. పెదబాబు, నాయకులు మాజీ జెడ్పీటీసీ బి.శ్రీకుమార్‌, కె.కామేశ్వరరావు, ఎల్‌.సులోచనారాణి, పి.రాజులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చిన జగనన్న

బంటుమిల్లి: 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రకటించిన తేదీల ప్రకారం నెరవేర్చి పేద ప్రజల ఖాతాల్లో సొమ్ములు జమచేసిన ఘనుడు మన ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక అన్నారు. మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట, జానకీరామపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. హారిక స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేసి ఫ్యాన్‌ గుర్తులపై ఓట్లు వేసి వైఎస్సార్‌ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్‌ (రాము), మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ వి.చినబాబు, ఎంపీటీసీలు ఎం.తిరుపతమ్మ, ఆలీం, జి.శ్రీనివాసరావు, ఎస్‌.శ్రీనివాస్‌, నాయకులు వై.కొండలరావు, పి.వెంకటేశ్వరరావు, ఎం.రాజబాబు, కె.మహంతి, ఎం.నాగేశ్వరరావు, వై.శివ, పి.నరేష్‌, ఎస్‌.ఏసు, ఎస్‌.ఏడుకొండలు, ఎస్‌.రాజేష్‌, పి.రాజు, జి.ప్రసన్నకుమారి, వై.వరలక్ష్మి, షహనాజ్‌బేగం, పి.పుష్ప, ఎం.భ్రమరాంబ, నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మల్లవోలులో విజయీభవ యాత్ర రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఉప్పాల రాము



జానకీరామపురం గ్రామంలో వృద్ధుడితో మాట్లాడుతున్న హారిక

ముగిసిన బ్రహ్మోత్సవాలు

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరంలో అత్యంత ప్రాచీన చారిత్రిక ప్రసిద్ధిగల దుర్గా–గణేశ్వరస్వామి, పార్వతీ–సంగమేశ్వర స్వామి ఆలయాల్లో మూడు రోజుల పాటు జరిగిన కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. సోమవారం రాత్రి ఆలయ అర్చకులు పి.వి.ఎస్‌ సాయిశర్మ, సత్యనారాయణశాస్త్రి బ్రహ్మత్వంలో దుర్గా–గణేశ్వరస్వామి, పార్వతీ–సంగమేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్ర మూర్తి (రాంబాబు) తనయుడు మండల వెంకటస్వామి నాయుడు, ప్రత్యూష దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం పూజలు జరిపారు. కల్యాణ వేడుకకు ముందు జగజ్యోతి, ఎదుర్కోలు వేడుక సంప్రదాయ రీతిలో కోలాహలంగా జరిపారు. మంగళవారం ఉదయం గణపేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ వారాభిషేకములు, రుద్రహోమం, పూర్ణాహుతి, కొట్నాలు, వసంతోత్సవం జరిగాయి. అనంతరం రథోత్సవం, ధ్వజారోహణ, ద్వాదశ ప్రదక్షిణలతో కల్యాణోత్సవాలకు స్వస్తి పలికారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణానికి ముందు జరిగిన సంప్రదాయిక ఎదుర్కోలు ఉత్సవం

సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వండి

ఆముదార్లంక(చల్లపల్లి): ప్రజలు సంక్షేమ పరిపాలనకు మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావు కోరారు. మంగళవారం సాయంత్రం ఆముదార్లంకలో డాక్టర్‌ చంద్రశేఖరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామీణ అభివృద్ధికి, గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ నడకుదుటి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌కు నేటితో ఆఖరు

1,261 పోస్టల్‌ బ్యాలెట్లు వినియోగించుకున్న ఉద్యోగులు

పెడన: కేంద్ర ఎన్నికల సంఘం వంద శాతం ఓట్లు పోలింగ్‌ జరగాలనే సంకల్పంతో తీసుకున్న చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల వారికి ప్రత్యేక అవకాశం కల్పించి పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో పెడన నియోజకవర్గంలో మంగళవారం వరకు 1,261 మంది ఉద్యోగులు, ఎస్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ వలంటీర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారంతో ఈ పోస్టల్‌ బ్యాలెట్‌కు తుది గడువు విధించారు. మంగళవారం 133 మంది ఓటు హక్కు వినియోగించుకోగా వీరిలో 50 మంది కొత్తగా ఫారం–12 దరఖాస్తు చేసుకుని ఓటు హక్కు వినియోగించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాసవి ఇంజినీరింగ్‌ కళాశాలలో పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోదలచిన వారు ఫారం–12 తీసుకుని దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎన్నికల అధికారి వెంకటరమణ సూచించారు.

విద్యుత్‌ తీగలపై ఒరిగిన తాటి చెట్టు



మోపిదేవి: మండలంలో ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. మంగళవారం సాయంత్రం వీచిన గాలులకు మోపిదేవి జాతీయ రహదారి పక్కనే తాటి చెట్టు విద్యుత్‌ మెయిన్‌ వైర్లపై పడటంతో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో రెండు గంటల పాటు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌ శాఖ అధికారులు స్పందించి తీగలపై పడిన తాటిచెట్టును పక్కకు తొలగించి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు.

రమేష్‌ బాబు ప్రచారానికి బ్రహ్మరథం

కోడూరు నుంచి భావదేవరపల్లి వరకు రోడ్‌షో

కోడూరు: వైఎస్సార్‌ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బుధవారం కోడూరు వంతెన సెంటర్‌ వద్ద నుంచి నాగాయలంక మండలం భావదేవరపల్లి వరకు రమేష్‌బాబు రోడ్‌షో నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు రోడ్‌షోను ప్రారంభించి, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, జరుగువానిపాలెం, పాదాలవారిపాలెం, మందపాకల, పోటుమీద గ్రామాల మీదగా భావదేవరపల్లి వరకు కొనసాగింది. రమేష్‌బాబు ప్రచారానికి ప్రతి గ్రామంలో విశేష స్పందన లభించింది. మహిళలు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువత 'జై జగన్‌.. జై సింహాద్రి' నినాదాలతో హోరెత్తించారు.

ఆకట్టుకున్న బైక్‌ ర్యాలీ..

రోడ్‌షోను పురస్కరించుకొని పార్టీ మండల శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీని ప్రారంభించారు. పార్టీ శ్రేణులు ద్విచక్రవాహనాలకు భారీ పార్టీ జెండాలను కట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. డప్పుకళాకారులు ప్రత్యేక వాహనంపై ఊరేగుతూ, పార్టీకి, జగనన్నకు సంబంధించిన పాటలను ఆలపిస్తూ, వాటికి అనుగుణంగా ప్రదర్శనలిచ్చారు.



కోడూరులో రమేష్‌బాబు రోడ్‌షో

జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి..

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రమేష్‌బాబు అన్నారు. కూటమి నేతలు పేదలకు అందాల్సిన పథకాలు కూడా అందనివ్వకుండా అడ్డుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, రైతులకు ఉపయోగపడేలా ఇన్‌పుట్‌ సబ్సిడీ, విద్యాదీవెన నగదు విడుదలకు అనుమతి కోరితే, వీటిని ఇవ్వకుండా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు అడ్డుపడుతున్నారని ప్రజలు గమనించారన్నారు. తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని, రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుపైనే వేయాలని రమేష్‌బాబు కోరారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్‌ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో జోష్‌ నింపిన రోడ్‌ షో

- అడుగడుగునా ఎమ్మెల్యే సింహాద్రికి నీరాజనాలు
- మూడు రోజుల్లో 193 కి.మీ మేర 69 గ్రామాల్లో రోడ్‌షో
- ప్రచారంలో దూసుకు పోతున్న ఫ్యాన్‌

అవనిగడ్డ: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఎమ్మెల్యే మూడు రోజుల క్రితం చేపట్టిన రోడ్‌షో వైఎస్సార్‌ సీపీలో జోష్‌ తీసుకొచ్చింది. నాలుగు మండలాల్లో పూర్తయిన రోడ్‌షో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపినట్టయింది. రోజుకు 22 గ్రామాలకు పైగా సాగుతున్న ఈ రోడ్‌షోలతో ఎమ్మెల్యే సింహాద్రి ప్రచారంలో దూసుకు పోతున్నారు.

వైఎస్సార్‌ సీపీ కార్యాలయం నుంచి..

అవనిగడ్డ నుంచి రోడ్‌షో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి శనివారం ప్రారంభించారు. వైఎస్సార్‌ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన రోడ్‌షో అవనిగడ్డ మండలంలోని కొత్తపేట, తిప్పపాలెం, రామచంద్రపురం, రామకోటిపురం మీదుగా కోడూరు మండలంలోని పాలకాయతిప్ప వరకూ సాగింది. తొలిరోజు 22 గ్రామాల్లో 64 కి.మీ మేర రోడ్‌షో సాగింది. తొలిరోజు రెండు మండలాలు కవర్‌ అయ్యాయి. రెండవ రోజైన ఆదివారం నాగాయలంక నుంచి మర్రిపాలెం, నంగేగడ్డ, చోడవరం మీదుగా గుల్లలమోద, సొర్లగొంది. దీనదయాల్‌పురంతో పాటు 25 గ్రామాల్లో మొత్తం 67 కి.మీ మేర రోడ్‌షో జరిగింది. మూడో రోజైన సోమవారం ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ప్రారంభమైన రోడ్‌షో చిలకలపూడి, రుద్రవరం, పూషడం, దాలిపర్రుతో పాటు మొత్తం 22 గ్రామాల్లో 62 కి.మీ మేర రోడ్‌షో సాగింది.

అడుగడుగునా జననీరాజనం..

రోడ్‌షో కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకి అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. మహిళలు ఎమ్మెల్యేకి ఎదురేగి హారతులిచ్చి, పూలు జల్లి స్వాగతం పలుకుతున్నారు. యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో రోడ్‌షో ముందు సాగే బైక్‌ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటి వరకూ నాలుగు మండలాల్లో 69 గ్రామాలను కలుపుతూ 193 కి.మీ మేర నిర్వహించిన ఈ రోడ్‌షోలతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యర్థులకు అందనంత స్పీడుతో ప్రచారంలో దూసుకుపోతున్నారు.



రోడ్‌ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌ బాబు

ఎమ్మెల్యే సతీమణి ఇంటింటి ప్రచారం



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని 5,6 వార్డులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సతీమణి కెప్టెన్‌ లక్ష్మి, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ మేనిఫెస్టోని ప్రజలకు అందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గార్లపాటి గోపి, తుంగల అంకారావు, సనకా బుజ్జితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మత్స్యపరిశ్రమకు జగనన్న వెన్నుదన్ను

గుల్లలమోద(నాగాయలంక): తీర ప్రాంతాల మత్స్య పరిశ్రమకు జగనన్న వెన్నుదన్నుగా నిలవడంతో రానున్న కాలంలో మరింత మేలు చేకూరుతుందని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గం యువనేత సింహాద్రి వికాస్‌ పేర్కొన్నారు. మంగళవారం నాగాయలంక మండలంలోని తీరగ్రామం గుల్లలమోద, టి.కొత్తపాలె గ్రామాల్లో పార్టీశ్రేణులు, అభిమానులు, కార్యకర్తలతో కలసి వికాస్‌ విస్తృత ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌ రెడ్డి ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి మేనిఫెస్టోను మహిళలకు, వృద్ధులకు వివరించారు. జగనన్న ఇచ్చిన హామీలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే మళ్లీ జగన్‌ మోహన్‌ రెడ్డిని మనమందరం గెలిపించుకుందామన్నారు. మే13న జరిగే పోలింగ్‌లో అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి రమేష్‌బాబు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు సారథ్యంలో సాగిన ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మరో వైపు మండల వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పెదపాలెం, దీనదయాళపురం గ్రామాలలో మండల నార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జోరుగా హుషారుగా సాగింది.



టి.కొత్తపాలెం ఎన్నికల ప్రచారంలో యువనేత సింహాద్రి వికాస్‌, మండల నాయకులు

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

మచిలీపట్నంటౌన్‌: వైఎస్సార్‌ సీపీ మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం సాయంత్రం భారీ వర్షంలో సైతం ప్రచారాన్ని కొనసాగించారు. భారీ ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షంలో తడుస్తూనే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. పేర్ని కిట్టు మంగళవారం రామానాయుడుపేట, ఇంగ్లిషుపాలెం, సుకర్లాబాద్‌, పాతరామన్నపేట, సర్కిల్‌పేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అమలుకాని హామీలను ఇచ్చి ప్రజలను మరోసారి మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రతి నెలా వలంటీర్ల ద్వారా ప్రభుత్వం పింఛన్లను తలుపుతట్టి మరీ అందిస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అండ్‌ కో ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వకుండా కుట్రపన్నారన్నారు. దీంతో వృద్ధులు, బ్యాంకుల వద్ద పడిగాపులు పడి పింఛను సొమ్ము తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీనికి రానున్న ఎన్నికల్లో చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పేర్ని కిట్టుకు మహిళలు విజయహారతులు పట్టగా పలువురు కార్యకర్తలు, నాయకులు గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. సర్కిల్‌పేటలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పేర్ని కిట్టు, కార్పొరేటర్‌ చిత్తజల్లు ప్రసన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేర్ని కిట్టుకు హారతులు ఇస్తున్న మహిళలు

పథకాలను అడ్డుకుంటున్న కూటమికి బుద్ధి చెప్పండి

గంజివానిపాలెం(మోపిదేవి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌ సీపీ దూసుకుపోతోంది. మండల పరిధిలోని గంజివానిపాలెం ఎస్సీకాలనీలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా జగనన్న అందించిన నవరత్నాలు వివరించి కరపత్రాలు అందజేశారు. జగనన్న అందించే కొత్త మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. పేదవర్గాల జీవన విధానం మారాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జగనన్న ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్‌ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్‌ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివనాగరాజు, పీఏసీఎస్‌ చైర్‌ పర్సన్‌ రావి రాంప్రసాద్‌, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, మండల బీసీ కన్వీనర్‌ రాజులపాటి నాగేశ్వరావు, జిల్లా కన్వీనర్‌ మోర్ల శ్రీనివాసరావు, దిలీప్‌, మండల పరిశీలకులు ఇంకొల్లు శేషగిరిరావు, సింహాద్రి శివాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



గంజివానిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్‌: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హనుమాన్‌జంక్షన్‌ సీఐ అల్లు నవీన్‌ నరసింహమూర్తి అన్నారు. ఎంపవరింగ్‌ యూత్‌ ఫర్‌ డెమోక్రటిక్‌ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు తలొగ్గకుండా దేశ ప్రగతి కోసం ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో కుల, మత, ప్రాంతీయ తత్వాలకు ప్రజలు గురికాకుండా చైతన్య వంతులను చేసేందుకు, యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు ఎంపవరింగ్‌ యూత్‌ ఫర్‌ డెమోక్రటిక్‌ ఇండియా సంస్థ చేస్తున్న కృషిని సీఐ అభినందించారు. ఆ సంస్థ ప్రతినిధి మజ్జి బాబు అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ నరసింహమూర్తి, పక్కన సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్‌

భక్తులందరికీ కుంకుమ పంపిణీ చేపట్టాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈవో కె.ఎస్‌.రామరావు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈవో మంగళవారం పరిశీలించారు. కుంకుమ ప్యాకింగ్‌ చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారన్నారు. దేవస్థానం చేపట్టిన ఉచిత కుంకుమ ప్రసాద పంపిణీని మరింత విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.. ఎంత మంది తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈవో ఎన్‌.రమేష్‌బాబు ఈవోకు వివరించారు.



ఆలయ అధికారులకు సూచనలిస్తున్న ఈవో రామరావు